క్లుప్తంగా

గ్యార్మీ వేడుకలకు వెలంపల్లి హాజరు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఇస్లాంపేట బీఆర్పీ రోడ్డులో ఉన్న హజరత్ సయ్యద్ గౌస్–ఎ– పాక్ మహబూబ్ సుభాని దర్గాలో శుక్రవారం రాత్రి నిర్వహించిన గ్యార్మీ వేడుకలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వెలంపల్లి శ్రీనివాసరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా నేతలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

శ్రీశ్రీనివాసునికి పంచామృత అభిషేకాలు



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్‌లో వేంచేసియున్న శ్రీపద్మావతి గోదాదేవి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి వారికి శుక్రవారం విశేష అలంకరణ చేసి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని తెల్లవారుజామున స్వామి వారికి సుప్రభాత సేవ అనంతరం స్వామి వారికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకులు రామరత్నమాచార్యులు శిష్యబృందం స్వామివారికి అభిషేకాలు నిర్వహించగా, స్వామి వారికి అలంకరణ, తులసీ దళ అర్చన, పూజా కార్యక్రమాల అనంతరం పెద్ద ఎత్తున భక్తులు స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు.

గజలక్ష్మీదేవిగా భ్రమరాంబ అమ్మవారు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని పురాతన ఆలయమైన పాతశివాలయంలో భ్రమరాంబ అమ్మవారు గజలక్ష్మీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం(పాత శివాలయం)లో కార్తీక నక్ష దీక్ష మహోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఆలయంలో శుక్రవారం పలు విశేష వైదిక కార్యక్రమాలను నిర్వహించారు.అమ్మవారికి ప్రత్యేక అలంకారం, అనంతరం త్రిశతి, ఖడ్గమాల, సహస్ర నామార్చన చేశారు. శ్రీ మల్లేశ్వరస్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, మహాలింగార్చన, ఆలయ ప్రదక్షిణలు, పంచ హారతులు అనంతరం చతుర్వేద స్వస్తి తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాలను ఆలయ కార్య నిర్వహణాధికారి నటరాజన్ షణ్ముగం పర్యవేక్షించారు.

అలరించిన భక్తిసంగీతం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలోని ధర్మపథం వేదికపై విజయవాడకు చెందిన అన్నమయ్య సంకీర్తన గాన ప్రచార భక్తబృందం ఆలపించిన భక్తిగీతాలు భక్తులను రంజింపచేశాయి. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం ధర్మపథం వేదికపై పప్పు సదాశివశాస్త్రి పలు కీర్తనలను, గీతాలను ఆలపించారు. సదాశివశాస్త్రికి వయోలిన్‌పై చావాలి శ్రీనివాస్, మృదంగంపై చావాలి కృష్ణమోహన్ చక్కటి సహకారం అందించారు. అమ్మవారిని దర్శించుకుని మహామండపంకు చేరుకున్న భక్తులు ధర్మపథం వేదికపై జరుగుతున్న కార్యక్రమాన్ని ఆద్యంతం ఎంతో ఆసక్తితో వీక్షించారు. అనంతరం ఆలయ అధికారులు సదాశివశాస్త్రి బృందానికి అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలను అందజేశారు.

దోమల లార్వా నివారణకు చర్యలు

లబ్బీపేట(విజయవాడతూర్పు):నివాస ప్రాంతాల్లో దోమల లార్వా నివారణకు పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నట్లు ఎన్టీఆర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని అన్నారు. ఆమె శుక్రవారం నగరంలో నిర్వహిస్తున్న ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. ఇంటింటికీ వెళ్లి లార్వా నాశక చర్యలు ఎలా తీసుకోవాలో ప్రజలకు వివరించారు. పలు ఇళ్లలో లార్వాను గుర్తించి, వ్యాధి కారక దోమలు వృద్ధి చెందుతున్న వైనాన్ని ఆ ఇళ్లలో నివాసం ఉంటున్న వారికి తెలియచేశారు. ఇంటితో పాటు, ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వ్యాధులు సోకకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో అవగాహన కలిగించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మోతీబాబు, వైద్యాధికారులు డాక్టర్ నిరుపమా, మలేరియా సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్రకట్టపై ప్రమాదకరంగా చెట్ల కొమ్మలు



ఎర్రకట్ట రహదారి వెంట దట్టంగా పెరిగిన కంపచెట్లు



పెరిగిన చెట్ల కొమ్మలతో మూసుకుపోయిన హెచ్చరికల బోర్డు

- మూసుకుపోయిన హెచ్చరికల బోర్డు
- ప్రమాదాల బారిన వాహనదారులు

వించిపేట(విజయవాడపశ్చిమ): నిత్యం వాహన చోదకులతో రద్దీగా ఉండే ఎర్రకట్ట రహదారిలో ముళ్లచెట్ల కొమ్మలు రోడ్డుపైకి చొచ్చుకురావడంతో వాహనదారులు తరచూ ప్రమాదాల బారినపడుతున్నారు. వన్‌టౌన్‌లోని చిట్టినగర్ నుంచి కేదారేశ్వర పేట, బీఆర్టీఎస్ రోడ్డుకు అనుసంధానంగా ఉన్న ఈ రోడ్డులో నిత్యం వేలాది మంది ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. అటువంటి ఈ దారిలో రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు, తుమ్మ చెట్లు ఏపుగా పెరిగి సైడు రైలింగ్ దాటి రోడ్డు మీదకి వచ్చాయి. దీంతో ద్విచక్రవాహనదారులకు చెట్ల కొమ్మలు తగిలి ప్రమాదాలకు గురవుతున్నారు. వాటిలో కొన్ని ముళ్ల చెట్లు కూడా ఉండటంతో అవి గుచ్చుకుని గాయాలపాలవుతున్నారు. ముఖ్యంగా రోడ్డు మలుపుల వద్ద దగ్గరకు వచ్చే వరకు చెట్ల కొమ్మలు కనిపించక వాహనచోదకులు ప్రమాదాల బారినపడి గాయపడుతున్న సంఘటనలు తరచూ చోటుచేసుకుంటున్నాయి.

కనిపించని హెచ్చరికల బోర్డులు...

ఎర్రకట్ట రహదారిలో ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి వాహనదారులను అప్రమత్తం చేస్తూ వేగ నియంత్రణ, ప్రమాదకర మలుపులు, ప్రమాదం జరిగే ప్రాంతాల వివరాలను తెలిపేలా రవాణశాఖ సూచికల బోర్డును ఏర్పాటు చేసింది. అయితే రహదారికి ఇరువైపులా దట్టంగా పెరిగిన చెట్ల కొమ్మల మధ్య ఆ బోర్డులు మూసుకుపోయాయి. దీంతో మలుపులు, వేగనియంత్రణ సమాచారం తెలియక వాహనచోదకులు అవస్థలుపడుతున్నారు. తరచూ ప్రమాదాల బారినపడుతున్నారు. ఇకనైనా నగరపాలకసంస్థ అధికారులు స్పందించి ఎర్రకట్ట రహదారి వెంబడి విస్తృతంగా పెరిగిన చెట్ల కొమ్మలు తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

చెట్ల కొమ్మలు తొలగించాలి..



ఎర్రకట్ట రహదారి వెంబడి చెట్ల కొమ్మలు ప్రమాదకరంగా మారాయి. ట్రాఫిక్ ఎక్కువగా ఉంటున్న సమయంలో రోడ్డు మార్జిన్ దిగే సమయంలో చెట్ల కొమ్మలు తగిలి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. నగర పాలకసంస్థ అధికారులు స్పందించి చెట్ల కొమ్మలు తొలగింపజేయాలి.

– కె.సాయి, వాహనదారుడు

మల్లేశ్వరస్వామికి విశేష పూజలు



దీపాలంకరణ సేవలో ఆది దంపతులు



స్వామి వారిని దర్శించుకుంటున్న ఈవో రామరావు, ఆలయ అర్చకులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరస్వామి వారికి శుక్రవారం విశేష పూజలు, అభిషేకాలు, దీపాలంకరణ సేవ, ఊంజల్ సేవ నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మల్లేశ్వరస్వామి వారికి పంచామృత అభిషేకాలు, విశేష అలంకరణ జరిగాయి. సాయంత్రం స్వామి వారి ఆలయ ప్రాంగణంలో సహస్ర లింగార్చన నిర్వహించారు. ఆలయ అర్చకులు లింగార్చనను ఎంతో భక్తి శ్రద్ధలతో నిర్వహించగా, పలువురు ఉభయదాతలు, భక్తులు తమ నామగోత్రాలతో పూజలు జరిపించుకున్నారు. అనంతరం సహస్ర లింగార్చన అనంతరం స్వామి వారికి విశేష అలంకరణ జరిగింది. ఆలయ ఈవో కెఎస్.రామరావు, ఆలయ వైదిక కమిటీ సభ్యులు, వేద పండితులు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం సహస్ర దీపాలంకరణ సేవ, ఊంజల్ సేవ నిర్వహించారు. శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి వార్ల ఉత్సవ మూర్తులకు పూజల అనంతరం దీపాలంకరణ సేవ నిర్వహించారు. ఆయా పూజా కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు .

అడ్వంచర్ గేమ్స్‌ను అందుబాటులోకి తేవాలి

బీఐటీసీ ఇన్‌చార్జ్ సీఈఓ



భవానీద్వీపంలో పర్యటిస్తున్న బీఐటీసీ ఇన్‌చార్జి సీఈఓ స్వామినాయుడు

భవానీపురం(విజయవాడపశ్చిమ): కార్తీక మాసాన్ని పురస్కరించుకుని భవానీ ద్వీపానికి వచ్చే పర్యాటకులకు అడ్వంచర్ గేమ్స్‌ను అందుబాటులో ఉంచాలని భవానీ ఐలాండ్ టూరిజం కార్పొరేషన్ (బీఐటీసీ) ఇన్‌చార్జ్ సీఈఓ స్వామి నాయుడు సిబ్బందిని ఆదేశించారు. బీఐటీసీ ఇన్‌చార్జ్ సీఈఓగా నియమితులైన ఆయన శుక్రవారం భవానీ ద్వీపాన్ని సందర్శించారు. ఇటీవల సంభవించిన వరద కారణంగా జరిగిన నష్టం, అనంతరం చేపట్టిన పునరుద్ధరణ పనుల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పర్యాటకులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సాధ్యమైనంత త్వరగా పునరుద్ధరణ పనులను పూర్తి చేసి ద్వీపానికి పూర్వవైభవం తీసుకురావాలని సూచించారు. వరద వచ్చి వెళ్లి రెండు నెలలు అయినా ద్వీపానికి విద్యుత్ సరఫరా లేకపోవడంపై ఆశ్చర్యాన్ని వ్యక్తం చేస్తూ వెంటనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. వరద కారణంగా పాత్‌వేలపై పేరుకుపోయిన ఇసుక మేటలను వారం రోజుల్లో తొలగించి మార్గాలను సుగమం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఆయనతోపాటు బీఐటీసీ మేనేజర్ రవీంద్ర, సిబ్బంది ఉన్నారు.

సీఎం బందోబస్తు ఏర్పాట్ల పరిశీలన



భవానీఘాట్‌లో బందోబస్తు ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీపీ రాజశేఖరబాబు, ఇన్‌చార్జ్ కలెక్టర్ నిధి మీనా

భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ –శ్రీశైలం మధ్య ప్రయోగాత్మకంగా చేపడుతున్న సీ ప్లేన్ సర్వీస్ డెమోను శనివారం ముఖ్యమంత్రి ప్రారంభించనున్న నేపథ్యంలో బందోబస్తు ఏర్పాట్లను నగర పోలీస్ కమిషనర్ ఎస్‌వీ రాజశేఖరబాబు ఇతర అధికారులతో శుక్రవారం పరిశీలించారు. భవానీఘాట్ పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కట్టుదిట్టమైన భద్రత, పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు, పార్కింగ్ తదితర వివరాలను పోలీసు అధికారులను అడిగితెలుసుకున్నారు. శాంతి భద్రతలు, ట్రాఫిక్ పరంగా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. బందోబస్తులో ఎక్కడా అలసత్వం ప్రదర్శించకుండా సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని తగిన చర్యలు తీసుకోవాలని అధికారులు, సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ కలెక్టర్ డాక్టర్ నిధి మీనా, డీసీపీలు గౌతమి షాలిని, ఏబీటీఎస్ ఉదయరాణి, కృష్ణమూర్తి నాయుడు, ఎస్‌వీడీ ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర, ఏడీసీపీ జీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాలయాల్లో ఈవో తనిఖీలు


ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వరస్వామివార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై ఉన్న అమ్మవారి సన్నిధిలోని పలు ఉపాలయాల్లో ఆలయ ఈవో కెఎస్.రామరావు శుక్రవారం తనిఖీలు చేపట్టారు. ఘాట్‌రోడ్డులోని వీరాంజనేయ స్వామి దేవస్థానం, లక్ష్మీగణపతి ఆలయం, శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి దేవస్థానం, నాగపుట్ట, నటరాజ స్వామి ఆలయం, మల్లేశ్వరస్వామి వారి ఆలయాలతోపాటు కొబ్బరి కాయలు కొట్టే ప్రదేశాన్ని ఈవో తనిఖీ చేశారు.

ఘాట్‌రోడ్డులోని వీరాంజనేయ స్వామి దేవస్థానంలో శర్మ సంగావరపు నాగేశ్వరరావు, లక్ష్మీగణపతి ఆలయంలో విధులు నిర్వహిస్తున్న అనధికార అర్చకులు, సహాయకులుగా ఉన్న చెరువు నాని, సాంబశివ అనే వారిని గుర్తించారు. అనధికారికంగా ఎవరైనా అర్చకులను సహాయకులుగా నియమించుకున్నట్లయితే వారిపై చర్యలు తీసుకుంటామని ఈవో హెచ్చరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): రామరాజ్యనగర్ సెక్షన్ 11 కేవీ సితార ఫీడర్ విద్యుత్ లైన్ల మరమ్మతులతోపాటు నిర్వహణ నిమిత్తం శనివారం ఉదయం రెండు గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజనీర్ పి.రవీంద్రబాబు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సితార సెంటర్, రాము క్వారి సెంటర్, మిథిలా నగర్, కబేళా సెంటర్, హెచ్‌బీ ఫంక్షన్ హాల్ ఏరియా, పోలేరమ్మ గుడి ఏరియాల్లో శనివారం ఉదయం ఎనిమిది గంటల నుంచి పది గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఈఈ కోరారు.

వరద బాధితులకు రూ.లక్ష విరాళం



సీఎం చంద్రబాబుకు చెక్కును అందజేస్తున్న ఏపీపీటీడీ కార్మిక పరిషత్ నేతలు

బస్టాండ్(విజయవాడపశ్చిమ): ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్ (ఏపీపీటీడీ) కార్మిక పరిషత్ నేతలు వరద బాధితులకు లక్షరూపాయలను ఆర్థికసాయంగా అందజేశారు. ఏపీపీటీడీ కార్మిక పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వి శేషగిరిరావు సమక్షంలో నేతలు సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి చెక్కును అందజేశారు. వరద బాధితులకు ఒక రోజు వేతనం ఇవ్వడమే కాకుండా రూ. 1 లక్ష విరాళం ఇవ్వడంపై సీఎం చంద్రబాబు వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఏపీఎస్ ఆర్టీసీ ఉద్యోగుల విలీన సమస్యలపై సీఎంకు వినతిపత్రం సమర్పించడంతో దానిపై సానుకూలంగా స్పందించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నట్లు సీఎం తెలపడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏపీపీటీడీ కార్మిక పరిషత్ ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు, నేతలు పాల్గొన్నారు.

18న అమ్మవారికి లక్ష పసుపుకొమ్ములతో అలంకరణ

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్‌లో వేంచేసియున్న శ్రీమహాలక్ష్మీ అమ్మవారికి 18వ తేదీన లక్ష పసుపు కొమ్ములతో అలంకరిస్తున్నట్లు ఆలయ అర్చకులు ప్రసాద్‌శర్మ తెలిపారు. ఈనెల 16వ తేదీ నుంచి 18వ తేదీ వరకు మూడు రోజులపాటు దేవస్థాన వార్షిక బ్రహ్మోత్సవాలను నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు లింగిపిల్లి అప్పారావు, మరుపిళ్ళ హనుమంతరావు వివరించారు. 16వ తేదీ శనివారం అమ్మవారికి విశేష పూజా కార్యక్రమాలు, అర్చన అనంతరం సారె సమర్పణ ఉంటుందన్నారు. భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ, గాజులు, చీరలను సారెగా సమర్పించవచ్చునని పేర్కొన్నారు. సోమవారం అమ్మవారికి లక్ష పసుపు కొమ్ములతో అలంకరణ, ఆలయ ప్రాంగణంలో లక్ష్మీ గణపతి, చండీ, రుద్ర హోమాలు, నవగ్రహ వాస్తు హోమాలను నిర్వహిస్తారని వివరించారు. ఉత్సవాల అనంతరం అమ్మవారికి అలంకరించిన పసుపు కొమ్ములను భక్తులకు పంపిణీ చేస్తామని వారు తెలిపారు.

చౌకగా మద్యం కాదు..నిత్యావసరాలు ఇవ్వాలి

సీపీఎం నేత బాబురావు



ప్రజాపోరులో పాల్గొన్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాబురావు, నాయకులు

వించిపేట(విజయవాడపశ్చిమ): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో ఇచ్చిన మాటతప్పి నిత్యవసర ధరలు పెంచడం ప్రజలకు ద్రోహం చేయడమేనని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ బాబురావు ఆరోపించారు. 55వ డివిజన్‌లో గొల్లపాలెంగట్టు రోడ్డులో స్థానిక కార్పొరేటర్ బోయి సత్యబాబుతో కలసి శుక్రవారం 'ప్రజాపోరు' కార్యక్రమాన్ని ప్రారంభించారు. డివిజన్‌లోని ప్రతి గడపకు వెళ్లి ప్రజా వ్యతిరేక విధానాలపై స్థానికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ రాష్ట్రంలో అధిక ధరలు, ప్రజా సమస్యలపై సీపీఎం ఆధ్వర్యంలో ఈనెల 14వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రజాపోరు కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. రాష్ట్రంలో చౌకగా మద్యం సరఫరా చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్తున్నారని, కాని ప్రజలకు కావాల్సింది మద్యం కాదని..నిత్యవసరాలు అని చంద్రబాబు గుర్తించాలని హితవు పలికారు. రాష్ట్రంలో రోజురోజుకు మహిళలు, మైనర్‌లపై దాడులు, అత్యాచారాలు పెరిగిపోతున్నాయన్నారు. ఏదైనా ఘటన జరిగినప్పుడు కూటమి నేతలు హడావుడి చేసి ప్రచారం పొంది, తరువాత పట్టించుకున్న పాపాన పోవడం లేదన్నారు. ఈ విషయాలపై ప్రజల్లో వస్తున్న వ్యతిరేకత చూసి కూటమి నేతలు ఒకరిపై ఒకరు నిందలు వేసుకుంటూ వారి తప్పులను కప్పిపుచ్చుకునే చర్యలకు దిగడం సిగ్గుచేటన్నారు. విద్యుత్ ట్రూ అప్ చార్జీల పేరుతో 17వేల కోట్లు ప్రజలపై భారం వేయడాన్ని సీపీఎం ఖండిస్తోందన్నారు. ఉచిత ఇసుక నేటికి అమలు కాకపోవడంతో భవన నిర్మాణ కార్మికులు పస్తులతో రోడ్డున పడుతున్నారన్నారు.

రాష్ట్రంలో పేదలకు వైద్యం దూరం చేసే కుట్రలో భాగంగానే మెడికల్ కాలేజీలను పీపీపీ పేరుతో ప్రైవేటు పరం చేసే చర్యలను చంద్రబాబు ప్రభుత్వం ఇకనైనా వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వస్తే 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీ అమలు చేయని కూటమి నేతలు, వారు మాత్రం నామినేటేడ్ పోస్టులను పంచుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ప్రజా సమస్యల పరిష్కార దిశగా ఈనెల 14న విజయవాడ కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న నిరసన కార్యక్రమంలో పెద్దసంఖ్యలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు కె.సునిల్‌బాబు, వరలక్ష్మి, రాజు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహం అడ్డగింత

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): బాల్య వివాహాన్ని అధికారులు అడ్డుకున్న ఘటన కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని పి.నైనవరంలో శుక్రవారం చోటు చేసుకుంది. సేకరించిన వివరాల మేరకు..మధ్యవర్తుల మాటలు నమ్మి పి.నైనవరంనకు చెందిన పదోతరగతి చదువుతున్న బాలికకు కడపకు చెందిన 34ఏళ్ల శివశంకర్‌కు ఇచ్చి వివాహం చేసేందుకు బాలిక తండ్రి నిర్ణయించారు. విషయం తెలుసుకున్న ఐసీడీఎస్ పీడీ. జీ. ఉమాదేవి సిబ్బందితో పి.నైనవరం చేరుకుని బాలిక తండ్రిని అదుపులోని తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చారు. బాలికను ప్రజ్వలా హోంకు తరలించారు. బాలికతో వివాహం చేయించేందుకు మధ్యవర్తులు రూ. 40 వేలు తీసుకున్నట్లు తెలుసుకున్న ఐసీడీఎస్ అధికారులు ఈ మేరకు సమాచారాన్ని కొత్తపేట పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు నిందితుల కోసం గాలిస్తున్నారు.

సృజనాత్మకతను వెలికితీసేందుకే సైన్స్ ఎక్స్‌పో



మాట్లాడుతున్న హైస్కూల్ సెక్రటరీ కరుణాకర్ దాస్




సైన్స్ ఎక్స్‌పోను తిలకిస్తున్న కాలేజీ విద్యార్థినులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యార్థులలో అంతర్లీనంగా దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు సైన్స్ ఎక్స్‌పో ఎంతగానో దోహదంపడుతుందని సెయింట్ పాల్స్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ లంక కరుణాకర్‌దాస్ పేర్కొన్నారు. గొల్లపూడి పంచాయతీ పరిధిలోని నల్లకుంట సెయింట్ పాల్స్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన సైన్స్ ఎక్స్‌పో విద్యార్థులను విశేషంగా ఆకట్టుకుంది. విద్యార్థులు ప్రదర్శించిన త్రీ డైమన్షనల్ షేప్స్, ఇస్రో రాకెట్ ప్రయోగాలు, డ్రిప్ ఇరిగేషన్, ఎఫెక్టెడ్ ఏరియాస్ బై బుడమేరు మోడల్‌ను సందర్శకులు ఆసక్తిగా తిలకించారు. తెలుగుతల్లి, మహాత్మాగాంధీ వేషధారణలో విద్యార్థులు ప్రత్యేకాకర్షణగా నిలిచారు.ఈసందర్భంగా అగ్రికల్చర్ మార్కెటింగ్ కమిటీ రీజనల్ జాయింట్ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు, డిప్యూటీ డైరెక్టర్(మార్కెటింగ్) ఎం.దివాకరరావు మాట్లాడుతూ దేశంలో ప్రసిద్ధి చెందిన శాస్త్రవేత్తలను స్ఫూర్తిగా తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. సైన్స్‌పై విద్యార్థులకు ఉన్న ఆసక్తిని గమనించి, వారిని అభినందించారు. పాఠశాల ప్రిన్సిపాల్ జాయిస్‌భూషణ్ కుమారి, క్యాపిటల్ మెరిట్స్ జూనియర్ కాలేజి ప్రిన్సిపాల్ వైవీకె సత్యానంద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

16న గురజాడ సాహితీ వైభవం

విజయవాడ కల్చరల్: రసభారతీ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 16న బందరు రోడ్డులోని ఠాగూరు గ్రంథాలయంలో నవయుగ కవితా వైతాళికుడు గురజాడ అప్పారావు సాహితీ వైభవం కార్యక్రమం నిర్వహిస్తునట్లు రసభారతి కార్యదర్శి డాక్టర్ జంధ్యాల పరదేశిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ గుమ్మా సాంబశివరావు, డాక్టర్ కావూరి సత్యవతి, డాక్టర్ పింగళి వెంకట కృష్ణారావు సాహితీ ప్రసంగాలు చేస్తారని పేర్కొన్నారు. కవుల స్వీయ కవితా గానం అనంతరం కవి పండిత సత్కారం నిర్వహిస్తామన్నారు.

కళాకారుల సంక్షేమం కోసం కృషి చేయాలి



కళాకారుల సమావేశంలో పాల్గొన్న విజయలక్ష్మి

విజయవాడ కల్చరల్: సాంస్కృతిక కళా సంస్థలు కళాకారుల సంక్షేమం కోసం కృషి చేయాలని మహానటి సావిత్రి సాహిత్య, సాంస్కృతిక కళాపీఠం సంక్షేమ సంఘం వ్యవస్థాపకురాలు పరుచూరి విజయలక్ష్మి అన్నారు. సావిత్రి కళాపీఠం ఆధ్వర్యంలో శుక్రవారం గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో కళాకారుల సమావేశం, సినీ నటుడు బాలకృష్ణకు సినీ సంగీత నీరాజనం నిర్వహించారు. కార్యక్రమాలను ప్రారంభించిన విజయలక్ష్మి మాట్లాడుతూ కళాకారులు సాంస్కృతిక రాయబారులని తెలిపారు. పేద కళాకారులకు ఆర్థిక సహాయం అందిస్తున్నామని చెప్పారు. నూతన గాయనీ గాయకులకు వేదిక కల్పిస్తున్నట్లు తెలిపారు. వివిధ సాహిత్య సంస్థల ప్రతినిధులు దూపాటి శ్రీదేవి, ప్రభల శ్రీనివాస్, ఎమ్ఎస్ నారాయణ. చావా నరసింహారావు, కె.డేవిడ్‌రాజు. డీవీ వీరభద్రరావు, ప్రసూనా రామన్ ప్రసంగించారు. మల్లాది స్వాతి, సుశీల్‌కుమార్, పి.శ్రీనివాసరావు, బెల్లంకొండ భారతి, విష్ణు ప్రియ తదితరులు పలు చిత్ర గీతాలను ఆలపించారు. గాయనీ గాయకులను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.


ఘనంగా సమర్పణ అభిషేక కృతజ్ఞత ఆరాధన



సమర్పణ అభిషేకం చేస్తున్న రెవ.జోసఫ్, రెవ.కిరణ్‌కుమార్, రెవ.శామ్యూల్ శేఖర్ తదితరులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్):ప్రస్తుత సమయంలో ఎక్కడ చూసినా యుద్ధ వాతావరణాలే కనిపిస్తున్నాయి. ప్రపంచ శాంతి కోసం ప్రతి సేవకుడు సమర్పణ కలిగిన ప్రార్థనలు చేయాలని తెలుగు బాప్టిస్ట్ చర్చీస్ జాతీయ ప్రధాన కార్యదర్శి రెవ.మంగలపూడి జోసఫ్ అన్నారు. సమర్పణ అభిషేక కృతజ్ఞత ఆరాధన దుర్గం సత్యం వీధిలో శుక్రవారం ఘనంగా జరిగింది. దీనికి ముఖ్య ప్రసంగీకులుగా హాజరైన రెవ.జోసఫ్ మాట్లాడుతూ నేటి సమాజంలో హింస నానాటికీ పెరిగిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధానంగా డబ్బు కోసం.. సరదాల కోసం.. లేనిపోని కోరికల కోసం మానవత్వం మంట గలిపేలా కొంతమంది ప్రవర్తిస్తున్నారని ఆవేదన చెందారు. ప్రేమ, కరుణ, దయ అనే గుణాలను మరచి.. ఒకరినొకరు చంపుకునేలా పగలు, ప్రతీకారాలు పెంచుకుంటున్నారన్నారు. ఎక్కడ చూసినా నెమ్మది లేదని.. ప్రాంతాల మధ్య, కులాల మధ్య, దేశాల మధ్య రగులుతున్న ఈ యుద్ధ వాతావరణం నుంచి మానవ సమాజాన్ని కాపాడేందుకు ప్రతి సేవకుడు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. అనంతరం రెవ.కిరణ్‌కుమార్, రెవ. ముక్కేర శామ్యూల్ శేఖర్, రెవ.డి.ఇస్సాకు, రెవ.కోలా డానియేల్‌లతో కలిసి పాస్టర్ మన్నం మహేష్, పలు సంఘ కాపరులకు సమర్పణ అభిషేకం చేసి, సర్టిఫికెట్లు అందజేశారు.

17న విజయవాడలో మారథాన్



మారథాన్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న మణిదీపక్, నాగేంద్ర, ఫణీంద్ర తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు):ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండటంతో పాటు, నడకను అలవాటు చేయాలనే ఉద్దేశంతో ఈ నెల 17న విజయవాడ రన్నర్స్ సొసైటీ , శ్రీరామ్ ఫైనాన్స్ ఆధ్వర్యంలో విజయవాడ మారథాన్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మణిదీపక్ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఎంజీ రోడ్డులోని ఓ హోటల్‌లో మారథాన్‌కు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. మణిదీపక్ మాట్లాడుతూ ఇప్పటి వరకూ 8 మారథాన్‌లు విజయవంతంగా నిర్వహించామని చెప్పారు. తొమ్మిదో మారథాన్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అందులో భాగంగా 5కే, 10కే, 21కే పరుగు ఉంటుందన్నారు. రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు యువత ఆసక్తి చూపుతున్నట్లు తెలిపారు. శ్రీరామ్ ఫైనాన్స్ ప్రతినిధులు ఈడుపుగంటి నాగేంద్ర, ఫణీంద్రలు మాట్లాడుతూ విజయవాడ మారథాన్‌కు ఒక ప్రత్యేకత ఉందన్నారు. రిజిస్ట్రేషన్ కోసం విజయవాడ రన్నర్స్ డాట్‌కాం కానీ, 7815955123 నంబర్‌ను కానీ సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో విజయవాడ రన్నర్స్ సభ్యులు నాగేశ్వరరావు పాల్గొన్నారు.